"ఆరు నెలలు"

'అరవింద'

"నేను కూడా వస్తాను" అంది సీత తలెత్తి నన్ను చూస్తూ. సూట్ కేస్‌లో నా బట్టలు సర్దుతోంది. నాకు ఢిల్లీ వెళ్ళాల్సిన పని ఉంది. అప్పటిదాకా సీతనే చూస్తున్న నేను వెంటనే నా చూపుల్ని మరలించుకున్నాను.

"వీలుకాదు. నాకు రెండు రోజులూ మీటింగ్ ఉంది. తీరిక ఉండదు. ఒక్కతెవూ హోటల్‌లో ఉండి ఏం చేస్తావూ" అన్నాను.

సీత మళ్ళీ మాట్లాడలేదు. మిగిలిన షర్టులు, సేవింగ్ సెట్, లోపల పెట్టి పెట్టె మూసేసి లాక్ చేసింది. కొత్తల్లో ఏవైనా భేదాభిప్రాయం వస్తే వాదనకి దిగేది. ఇప్పుడు మాట్లాడటం తగ్గించేసింది. ఇది నాకూ బాగుండలేదు. ఐనా.... నేనేం చెయ్యలేకపోతున్నాను.

నాకు ఆఫీస్‌పని ఒకరోజే ఉంది. రెండోరోజు పనిలేదు. రవికాంత్ ఇంట్లో అతనితో గడపటానికి నిశ్చయించుకున్నాను. ఆత్మపరిశీలన చేసుకోవాలనుకుంటున్నాను. సీత నా పక్కన, దగ్గర ఉంటే అది సాధ్యంకాదు. వీలైతే ఈ విషయం రవికాంత్‌తో చర్చించాలి. సీతతో నా పెళ్ళయి ఆరు నెలలైంది. ఈ ఆరు నెలలూ....

*　　　*　　　*

మెరీనా దీపాలతో మెరిసిపోతోంది. రకరకాల మనుషులతో కలకలంగా ఉంది. సముద్రపు కెరటాల్ని చూస్తూ కొంచెం దూరంలో కూర్చున్నాను నేను. ఒకదానివెంట ఒకటి వస్తూనే ఉన్నాయి కెరటాలు....ఆగకుండా. ఎన్నాళ్ళనుంచి జరుగుతోందో ఈ లీల! మనసులో ఆశ్చర్యం. సముద్రాన్ని ఎన్నిసార్లు చూసినా ఆశ్చర్యం కలుగుతూనే ఉంటుంది. కొంచెంసేపు ఆ సముద్రపు కెరటాలలో పాదాలు తడుపుకుంటూ ఆడుకుని వచ్చి కూర్చుంది సీత. నేను ఇంకా కెరటాలవైపే చూస్తున్నాను.

"నా చిన్నప్పుడు ఒకసారి విశాఖపట్నంలో సముద్రంలో పడిపోయాను. ఎవరో రక్షించారు. చచ్చిపోవలసింది" అంది నావైపు చూస్తూ.

"చచ్చిపోయినా బాగుండేది" అనిపించిన క్షణమైన నా ఊహకి వెంటనే ఉలికిపడ్డాను. నేనెందుకిట్లాగ మారిపోయాను? బాధగా అనుకుంటున్నాను.

"హాయ్ సీతా!" ఎవరో ఆనందాశ్చర్యాలు మేళవించిన కంఠంతో పలుకరిస్తున్నారు....అటుతిరిగి చూశాను.

ఎవడో వీడు! ఆకర్షణీయంగా ఉన్నాడు. వేషం బాగా వేశాడు. డబుల్‌బుల్ షర్ట్.... స్టైలిష్‌గా దువ్విన జుట్టు.

"ఓ....గౌతమ్!" అంది సీత. ఆ మొహంలో సంతోషం. కప్పు నిండిపోయి పొర్లిపోతున్నట్లు.

అతను మా పక్కనే కూర్చున్నాడు.

"రియల్ సర్‌ప్రైజ్. నిన్ను ఇక్కడ చూస్తానని అనుకోలేదెప్పుడూ!" అంది సీత.

"ఎర్త్ ఈజ్ రౌండ్! నేనూ అనుకోలేదు. ఇక్కడ ప్రోగ్రాం ఉండివచ్చాను," అన్నాడతడు.

"ఇతను గౌతమ్. చాలా బాగా పాడతాడు. ప్రోగ్రామ్స్ ఇస్తుంటాడు. ఈయన మావారు. రాజశేఖర్." పరిచయం చేసింది సీత.

"నమస్తే. మీకు తెలుసునో లేదో సీత చాలా బాగా పాడుతుంది."

"ఆయనకి తెలీదు. నేను సుశీలనా? నాజియాహసన్‌నా?" అంది సీత.

"నువ్వు ప్రయత్నం చేస్తే కదూ. చెయ్యలేదు. రాజశేఖరంగారి అదృష్టం బాగుంది. ఆయన భార్యవి అయ్యావు" అన్నాడు గౌతమ్ నవ్వుతూ.

నా అదృష్టం అఘోరించినట్లే ఉంది. భార్య రూపవతి శత్రుః అన్నారు పూర్వులు. భార్య ఆధునిక యువతి అయితే ఏమిటో నాకిప్పుడు తెలుస్తోంది.

"రేపు సాయంత్రం ప్రోగ్రామ్‌కి మీరు తప్పకుండా రావాలి. మిమ్మల్ని నా అతిథులుగా ఆహ్వానిస్తున్నాను" అన్నారు.

అతడి అభ్యర్థన నన్ను లోలోపల దహించుకుంటోంది.

"వెడదామా!" అంది సీత నన్ను చూస్తూ. సీత నావైపు చూస్తోందని తెలిస్తే చాలు నా మనసు కఠినమై పోతుంటుంది.

"సారీ. మేము రాలేము. ఏమీ అనుకోకండి. నాకు మీటింగ్ ఉంది" అన్నాను.

"ఇటీజ్ ఓ.కె." అని, సీతని చూడగలిగినందుకు మరొకసారి తనని తను అభినందించుకుంటూ వెళ్ళాడు అతడు.

ఇంటికి వెడుతూ సీత చెప్పింది. వాళ్ళ నాన్నగారికి సంగీతం చాలా ఇష్టంట. పాడమని ప్రోత్సహించేవారుట. ఫంక్షన్స్‌లో భజన్స్, లలితసంగీతం పాడుతుండేదిట. గౌతమ్‌తో కలిసి కొన్ని ప్రోగ్రామ్స్‌లో పాడిందిట. ఇంకా ఏదో చెప్తోంది. నేను వినటంలేదు. వినలేకపోతున్నాను.

"పాడటంవరకేనా వీళ్ళ చనువు! ఇంకా.... నువ్వు అంటోంది వాణ్ణి." కసి! మనసులో మంట నన్ను దహించివేస్తూ.

నాకు బాగా చదువుకుని, మంచి సంస్కారం, ప్రపంచ జ్ఞానం కలిగిఉండి ఇంకో మనిషితో చక్కగా కలిసి బ్రతకటానికి కావలసిన అవగాహన ఉన్న ఆధునిక యువతి అంటే చాలా ఇష్టం. గౌరవం. సీత అట్లాగ ఉండాలని కోరుకున్నాను. అట్లాగ ఉంటుందనుకున్నాను.

ఆ రాత్రి నిద్ర పట్టలేదు. ఆ రాత్రే కాదు. పెళ్ళయిన తర్వాత ఇంకా ఎన్నో రాత్రులు....

సీత బాంక్‌కి వెడుతుంది. పోస్టాఫీసుకి వెడుతుంది. అన్ని పనులూ చెయ్యగలదు. చేస్తుంది. ఎక్కడికి వెళ్ళినా ఎవరో కనిపిస్తారు. పలకరిస్తారు హాయ్ సీతా! అంటూ. ఎవరు వీళ్ళంతా!

ఇట్లాగ ఎంతమంది సీత చుట్టూ!

హనీమూన్‌కి ఊటీ వెళ్ళినప్పుడు!!!

ఒకవైపు మేఘమాలికల అందం. ఇంకొకవైపు నేలమీద రంగుల తివాచీలాగ పరుచుకున్న పూల సౌందర్యం. నా మనసులో, నా కళ్ళముందర, నా కలల్లో తను ఉండి, నాలో నిండి, నా గుండెమీద సరిగమలు పలికిస్తూ, నా ఉనికిని అందంగా చిత్రిస్తూ, సీత నా ఎదుట! నన్ను నేను మరిచిపోయి ఉన్న స్థితిలో ఎవరో మిలిటరీ వేన్ దిగి మావైపు పరిగెత్తుకుని వచ్చారు.

"హాయ్ సీతా!"

ఎవరో ధీరేంద్రకుమార్‌ట! నా చేయి గట్టిగా పట్టుకుని "హాపీ టు మీట్ యూ. ఐ కంగ్రాట్యులేట్ యూ ఫర్ యువర్ ఛాయిస్. మీరు చాలా లక్కీ. సీతని చేసుకున్నారు. అంత స్వీట్ అండ్ ఇన్నోసెంట్ గాల్‌ని మీరు ఈ కాలం వెతికినా చూడలేరు." అంటూ ఒకటే పొగడ్తలు. ముందర సంతోషం వేసింది. కానీ అంతతో ఆగలేదు అతడు.

"అందం ఉండటం అరుదు. అందానికి తెలివి కూడా తోడైతే అది గొప్ప సంగతి. అందానికి, తెలివికి మంచితనం కూడా కలిస్తే అది సీత! అద్భుతం! ఆనందం!" అన్నాడు. విని విని చిరాకు వేసింది.

"పోనీ తనే చేసుకోకపోయాడా?" అనిపించేసింది.

ఇంతకంటె ఏ గొప్పలూ లేనిదాన్ని చేసుకుంటే ప్రాణం హాయిగా ఉండును అనిపించింది.

ఇంకా ఒదిలిపెట్టలేదు. కాంటీన్‌కి తీసికెళ్ళి కాఫీ ఇప్పించాడు.

"సీత మీకు చెప్పిందో లేదో. వీళ్ళ పక్క ఇల్లే మాది. సీతా నన్ను పెళ్ళి చేసుకోకపోతే ఈ మందారచెట్టుకి ఉరి వేసుకుని చచ్చిపోతా అనేవాడిని. చచ్చిపో అనేది సీత. అలాగ ఉరికే సరదాకి...."

సరదాట! వాడి బొంద. ఐనా ఈ సీత మొహంలో ఆ ఆనందం, గొప్ప ఎందుకు! వాడు వెళ్ళిపోయాక చెప్పింది.

"ఒట్టి జిడ్డు. ప్రతి ఆడపిల్లతో స్నేహం చెయ్యాలని తహతహ. వీణ్ణెవరు పెళ్ళి చేసుకుంటారు! తెల్లవారి గార్డెన్‌లోకి వెళ్ళటానికి భయం. ఓ పువ్వు తెంపుకుని తయారయ్యేవాడు. సెలవలు వస్తున్నాయంటే భయం. బోరు. వీడు వచ్చే రైలుకి ఎక్కడైనా ఆక్సిడెంట్ అయితే బాగుండును అనిపించేది."

అంతా నాటకం! బోరుట. ఎందుకా అబద్ధాలు. తిరగటానికి, సరదాలు తీర్చుకోటానికి అందం కావాలా! కులాలు అడ్డా! సీతకి తల్లి లేదు సరే.... తండ్రి చూస్తూ ఊరుకున్నాడా?

"మీ డాడీ ఏమీ అనరూ!" అన్నాను ఎట్లాగో నోరువిప్పి.

"డాడీకి ఆడపిల్లలు పిరికిగా ఉండటం ఇష్టంలేదు. అందరితో బాగా మాట్లాడటం, ఎవరితో ఎట్లాగ ప్రవర్తించాలో తెలిసిఉండాలి అంటారు. ఎప్పుడైనా మా అత్తయ్య అనేది "ఇట్లాగైతే నీ కూతురికి పెళ్ళికాదు అని" అంటూ సీత నావైపు ఓరగా చూసింది.

చూస్తుంది! ఎందుకు చూడదూ. నన్ను బుట్టలో పెట్టారు మరి. పెళ్ళి ఎందుకు కాదూ. నా ఖర్మకాలి నేను వాళ్ళకి

దొరికాను. ఇటువంటి పిల్లనా నేను పెళ్ళి చేసుకున్నాను.... మనసుపడి!

ఆ రాత్రి నేను భోజనం చెయ్యలేదు. సీత బతిమాలింది.

"నన్ను విసిగించకు. నాకు ఆకలిలేదు." అన్నాను.

సీత కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఐనా నాకు జాలి వెయ్య లేదు. ఏం చూసి చేసుకుంది నన్ను! సన్నగా పొడుగ్గా ఉంటాను. స్కూల్లో నన్ను గెడకర్ర, లాంప్‌పోస్ట్ అనేవారు. పైగా నలుపు కూడాను. ఇంకొకసారి సినిమాకి వెళ్ళాం. అక్కడ ఎవరో దంపతులు కనిపించారు. మధ్యవయస్కులు. ఎప్పుడో ఎందుకో వాళ్ళింట్లో భోజనం చేసిందిట. అన్నీ వివరంగా చెప్పింది కానీ నేను వినలేదు. వినాలనిపించదు. అక్కడికక్కడే వాళ్ళని భోజనానికి రమ్మని పిలిచింది.

ఆ కోపంతో తర్వాత నేను నా స్నేహితులు ఇద్దర్ని భోజనానికి పిలిచాను. సీతకి కోపం వస్తుందనుకున్నాను. కోపం రాలేదు. చాలా చక్కగా వంటచేసింది సీత. వడ్డనచేసి కబుర్లు చెప్పి మర్యాద చేసింది. ఎంతో గర్వంగా అనిపించింది. కానీ అది నిలవలేదు.

అ తర్వాత రమణ తరచూ మా ఇంటికి రావటం మొదలుపెట్టాడు. నాకు చిరాకు ఎక్కువైంది. వాడు తమ్ముడు లాంటివాడు అంటుంది.

"స్నేహితులు ఉండాలి!ట".

ఎందుకు? సమస్యలు సృష్టించుకోటానికా!

అన్నట్టుగానే స్కూటర్ ఆక్సిడెంట్ అయింది. కాలు ఫ్రాక్చరయి నేను హాస్పిటల్లో ఉండాల్సి వచ్చింది. అప్పుడు రమణే చాలా సాయం చేశాడు. చూడటానికి అమ్మ వచ్చింది. అత్తాకోడళ్ళకి ఏం గొడవలు వస్తాయోనని భయపడ్డాను. ఏ భేదాలూ రాలేదు సరిగదా ఇద్దరికీ స్నేహమైపోయింది. అమ్మ వెళ్ళిపోతూ-

"సీత బంగారంరా!" అంది. సీత అమ్మని కూడా బుట్టలో పెట్టింది. బంగారం! ఈ కాలం బంగారంమీదే అందరి కళ్ళూ.

ఇంతమందికి మంచిది ఐన సీత నాకెందుకు బాధాకరంగా, సమస్యగా తయారయింది! క్షణం క్షణం అశాంతితో బ్రతకట మెట్లాగ? సీత కూడా బాధపడుతోందని తెలుస్తూనే ఉంది. సుఖ పెట్టాలని, బాధపెట్టకూడదని ప్రయత్నిస్తూనే ఉన్నాను. ఐనా సాధ్యపడకపోతే.... విడిపోవటం మేలా???

* * *

నేను వెళ్ళేటప్పటికి రవికాంత్ ఒక్కడే ఉన్నాడు ఇంట్లో. భార్య లేదు. డ్రింక్ ఆఫర్ చేసాడు. నేను అవసరాన్నిబట్టి అప్పుడప్పుడు తీసుకుంటాను. ఇవేళ గ్లూమీగా ఉంది. మనసులో మాట రవికాంత్‌తో చెప్పుకోవాలనుకుంటున్నాను. డ్రింక్ అవసర మనిపించింది. తీసుకున్నాను.

"నీ శ్రీమతి పుట్టింటికి వెళ్ళిందా!" కుశలప్రశ్న వేశాను.

"ఊఁ. నామీద కోపంతో వెళ్ళిపోయింది. మళ్ళీ రాక పోవచ్చు కూడాను. తనకి తెలుసు నేను డ్రింక్ చేస్తానని, ఆఫీస్ పనిమీద ఊళ్ళకి వెళ్ళాలని. ఐనా అస్తమానం వేధిస్తుంది. సాధిస్తుంది." అన్నాడు.

రవికాంత్ ఇదివరకు ఇంట్లో తాగేవాడు కాదు. క్లబ్ లోనూ, పార్టీల్లోనూ తప్ప. ఇప్పుడు ఇంట్లో కాబినెట్‌లో రక రకాల డ్రింక్స్ కనిపిస్తున్నాయి.

"నువ్వు అవసరాన్నిమించి తాగుతావేమో!" అన్నాను.

"అవసరం అంటే ఏమిటి? నేను తాగి తందనాలు ఆడను. నా స్టేటస్ చూసుకుంటాను. నా ఇంటికి పెద్ద పెద్ద ఆఫీసర్లు వస్తారు. బిజినెస్‌మెన్ వస్తారు" అన్నారు.

ఔను. ఇప్పుడు వీడు పెద్దవాడై పోయాడు. మాలతి తెలిసే చేసుకుంది వీణ్ణి. ఐనా ఇప్పుడు భరించలేకపోతోంది. అంటే వీడు తప్పకుండా బరితెగించి ఉంటాడు. వీణ్ణి మారుద్దామని, మార్చగలనని అనుకుని ఉంటుంది. మార్చలేకపోయింది. అహం దెబ్బతింది. ఎదురుతిరిగింది. కాపురం కూలిపోయింది. తప్పు వీడిదా, ఆవిడదా? సుస్థిరమైన విలువల్నిబట్టి చూస్తే తాగటం గొప్ప నేరం, ఇల్లు గుల్ల .... వొళ్ళు గుల్ల .... వీడిదే తప్పు!

"నీ భార్య సంతోషం కోసం, నీ సంసార సుఖం కోసం నువ్వు డ్రింక్ చెయ్యటం మానేయవలసింది. త్యాగం చెయ్యా ల్సింది!" అన్నాను.

"నువ్వు కూడా నన్ను ఇర్రిటేట్ చెయ్యకు. నీకు అసలు సంగతి తెలియదు. దానికి నేనంటే లక్ష్యంలేదు. సరదాలు కావాలి. మగస్నేహాలు కావాలి. నేను ఊరికి వెడితే ఇంట్లో ఉండదు. ఎక్కడెక్కడికో వెడుతుంది. ఎవరెవరితోనో తిరుగు తుంది. నేను ఇంట్లో ఉన్నప్పుడు కూడా రాత్రి లేట్‌గా ఎవరో డ్రాప్ చేస్తుంటారు. ఇదంతా కవర్ చేసుకోటానికి నన్ను.... నన్ను తాగొద్దని గొడవ లేవదీస్తుంది" అన్నాడు.

నా వొంట్లో రక్తం వేడెక్కిపోతోంది. తలలో నరాలు చిట్లిపోతాయి అనిపిస్తుంది. రవికాంత్ చెప్తున్నదంతా నిజమేనా?

ఎంత నిజం? ఎంత భ్రాంతి?

ఎటువంటి సుడిగుండంలో పడ్డాడు!

బ్రతకటానికి ఎంత సంయమనం కావాలి!

నాలో పొంగిన ఉద్రేకాన్ని అదుపులో పెట్టుకుంటూ

"స్టాపిట్ రవికాంత్! స్టాపిట్. నువ్వు అనవసరంగా అనుమానిస్తున్నావు నీ భార్యని. నువ్వు ఎప్పుడైనా నీ కళ్ళతో చూశావా? నీకేమైనా ఋజువు ఉందా?"

రవికాంత్ సోఫాలో వెనక్కి వాలిపోయాడు. కళ్ళు మూసుకున్నాడు.

"నేను చూడలేదు. చూడనవసరంలేదు. నాకు తెలుసు." అన్నాడు.

తెలుసు! ఏమిటి తెలుసు?

నాకు పెద్దగా నవ్వాలనిపించింది.

రవికి ఏం తెలుసు! నాకు ఏం తెలుసు!

రవికాంత్ వెనకాల, నాకు ఎదురుగా ఉన్న గోడమీద నా మనోనేత్రానికి విస్టావిజన్‌లో సీత కనిపిస్తోంది. తలవంచుకుని పమిటకొంగు కొస నలుపుతూ.

"నవ్వాలనే అనుకుంటున్నాను. ఐనా ఏడుపే వస్తోంది" అంటోంది.

మనిషికి ఏం తెలుసు?

తను సృష్టించుకున్న భ్రమల వలయంలో చిక్కుకుని బయటపడలేక బాధపడటం తెలుసు. నరకాన్ని సృష్టించడం తెలుసు.

ఏది తప్పో ఏది ఒప్పో తెలుసా?

రవిలో నన్ను నేను చూసుకోగలుగుతున్నాను.

"తెలుసు! నీకు ఏమిటి తెలుసు? తెలుసు అనుకుంటాము కానీ మనకి ఏమీ తెలియదు. ఆనందంగా ఉండటం అసలు తెలీదు. జీవితాన్ని చేతులారా దుఃఖమయం చేసుకోవటమే మనకి తెలుసు. మూఢనమ్మకాలు, సందేహాలు, అనుమానాలూ, పంతాలూ, అహంకారాలూ మనని పట్టిపీడిస్తుంటాయి. మనిషిని ఎదగనీయకుండా, ఆనందంగా బ్రతకకుండా ఉరివేస్తున్నాయి. వాటికి లొంగకూడదు. వీటినించి బయటపడాలి. ఎదిరించాలి.... పోరాడాలి.... గెలవాలి!"

వాడికి ఇంకా ఏం బోధించానో.... ఏం మాట్లాడానో....

మనసునిండా విషాదం....ఆవేదన.

నేను మాత్రం ఏం చేస్తున్నాను! అన్యాయం చేశాను.... సీతకి! న్యాయం చెయ్యాలి. ప్రేమించాలి. ఆనందంగా ఉంచాలి.

సీత గురించి నేను రవికాంత్‌కి ఏమీ చెప్పలేదు. చెప్ప దలుచుకోలేదు. నేను వచ్చేముందర రవికాంత్ అడిగాడు.

"నీ పెళ్ళి సడన్‌గా నిశ్చయమైందని రాశావు. నాకు రావటానికి వ్యవధి లేకపోయింది. నీ భార్య అందంగా ఉంటుందనుకుంటాను. మీరు హాపీగా ఉన్నారనుకుంటాను."

"ఆ. అంతా అనుకోకుండా అయిపోయింది. తెలిసినవాళ్ళు ఈ సంబంధం చెప్తే చూడటానికి వెళ్ళాను. ఒక్కడినే! అమ్మాయి చూడగానే నచ్చింది. వాళ్ళ నాన్నగారికోసం ఎవరో వచ్చారనుకుని కాఫీ తెచ్చింది. షల్వార్, కమీజ్ వేసుకుంది. ఒక జడ! పైపై మెరుగులు లేవు. కాఫీ ఇస్తూ నవ్వింది. కళ్ళలో అమాయకత్వం, తెలివి కనిపించాయి. మేము మాట్లాడుతుండగానే తండ్రికి గుండెలో నొప్పి వచ్చింది....హార్ట్ ఎటాక్. వెంటనే సీతా నేనూ కలిసి ఆయన్ని హాస్పిటల్‌కి తీసికెళ్ళాము. ఆయన నా చేయి పట్టుకుని

"సీత పెళ్ళి నిర్లక్ష్యంచేసి నేను చాలా పొరపాటు చేశాను. నువ్వు నాకు నచ్చావు. నువ్వు సీతని పెళ్ళి చేసుకుంటే నేను చాలా సంతోషిస్తాను. నిశ్చింతగా కన్నుమూస్తాను" అన్నాడు.

నేను వెంటనే ప్రామిస్ చేశాను, పెళ్ళి చేసుకుంటానని. ఆయన రెండు వారాల్లో కోలుకున్నాడు. మా పెళ్ళయిపోయింది."

రవికాంత్ సరదాగా నవ్వేస్తూ

"ఐతే నీ పెళ్ళిలో చాలా డ్రామా ఉందన్నమాట!" అన్నాడు.

ఈ సృష్టి అంతా చేసి ఆఖరిగా స్త్రీని సృష్టించాడు భగవంతుడు. పురుషుణ్ణి నియమించడానికే! స్త్రీయేగనక లేకపోతే ఈ భూమిమీద పురుషుడు జంతువుగానే మిగిలి ఉండేవాడు అంటాడొక రచయిత.

"స్త్రీ పురుషులలో స్త్రీజాతి బలహీనమైనదంటారు. నిజానికి స్త్రీయే ఉత్తమమైన సృష్టి. సహనం, సౌశీల్యం, త్యాగం, అవగాహన మూర్తీభవించిన వ్యక్తిత్వం స్త్రీది!" అంటారు గాంధీజీ.

కానీ ఈనాడు స్త్రీ సహనం వదిలేసింది.

ఎందుకు త్యాగంచెయ్యాలి? అని ప్రశ్నిస్తోంది.

ఆనాడు సహనం వహించినా, ఈనాడు అసహనం ప్రదర్శించినా ఈ భూమిమీద జీవితం ఆనందంగా ఉండాలనే!

సుఖవంతమైన సహచర్యం కోసమే!

ఓ స్త్రీ! ఈ పోరాటంలో నువ్వు దిగజారిపోకు. అక్కడే నిలబడు. నువ్వు ఒంటరివి కాదు. నీకు నేను సహకరిస్తాను.

జీవితానందంకోసం ఏమైనా చేస్తాను.

పురుష జాతినంతటినీ మేల్కొల్పాలని నాలో సరికొత్త ఆరాటం!"

* * *

గేటు తీసుకుని లోపలికి వెళ్ళేటప్పటికి డ్రాయింగ్‌రూమ్‌లో సీత ఎవరితోనో మాట్లాడుతూ ఉంది.

సీత సోఫాలో కూర్చుని ఉంది.

అతడు దగ్గరలోనే నిలబడి ఉన్నాడు. చేతిలో ఏభై రూపాయల నోటు ఉంది. కార్డ్రాయ్ పేంట్, టింటెడ్ గ్లాసెస్.... రిచ్‌గా ఉన్నాడు.

నన్ను చూడగానే సీత లేచి నిలబడింది. తల ఒంచుకుంది. కళ్ళు వాలిపోయాయి. శరీరం కంపిస్తోంది. నన్ను చూసి భయపడుతోంది.

"నమస్కారమండి!" అన్నాడతడు.

నాకేమౌతోంది! బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్.

రక్తంలో కరుణ విరిగి ద్వేషం ఎక్కిపోతోంది.

ఎవరు ఈ ఆపరేషన్ చేస్తున్నది? ఆపండి....ఆపండి....

"నువ్వు కూర్చో సీతా! నమస్కారం. మే ఐ నో యువర్ నేమ్ ప్లీజ్. మీరు సీతకి స్నేహితులా? బంధువులా?" అన్నాను.

అతడు కొంచెం అతిగా నవ్వుతూ

"ఏమీకానండి! మీ పొరుగింటివాణ్ణి." అన్నాడు.

పొరుగింటివాడా! ఎప్పుడూ చూడనేలేదు.

"మనం ఎప్పుడూ కలుసుకోలేదు సార్. మీ పనిమనిషే మా ఇంట్లో కూడా చేస్తోంది. నేను నిన్న ఆఫీసులో ఉండగా మా ఆవిడ కళ్ళు తిరిగి పడిపోయింది. సీతగారు వెంటనే వచ్చి ఆవిడని హాస్పిటల్‌కి తీసికెళ్ళారు. డాక్టర్ ఫీజూ అవీ....ఏభై రూపాయలయింది. అది ఇచ్చి బాకీ తీర్చుకుంటున్నాను." అన్నాడు. నేను మీ అందరి బాకీ తీర్చుకోగలనా! నన్ను నేను క్షమించుకోగలనా! రవికాంత్‌తో ఏమన్నాను! ఒకవేళ తిరుగుతోందే అనుకో. చవటలాగ వదిలేసి ఊరుకుంటావా? క్షమించలేవా? ప్రేమించలేవా? నీవైపు తిప్పుకోలేవా? అన్నాను.

నేనేం చేస్తున్నాను?

ఏ తప్పూ చెయ్యకుండానే సీతని....సీత ఎదురుతిరిగితే?

"వస్తానండి...." అతడు వెళ్ళిపోయాడు.

"కూచో సీతా! ఇక్కడ కాదు. బెడ్‌రూమ్‌లోకి రా!"

నా వెనకాల వచ్చింది సీత. నా పక్కన కూర్చోబెట్టుకున్నాను.

"అట్లాగ చూడకు సీతా! నేను పులిని కాదు. ఇన్నాళ్ళూ నిన్ను బాధపెట్టిన మాట నిజమే. అనుమానాలతో వేగిపోతూ నా గుండెని వధ్యశిలగా చేసుకున్నాను. ఎదురుగుండా గిన్నెలో అమృతం ఉన్నా తాగలేని వెధవలుంటారు ఈ లోకంలో! వాళ్ళలో ఒకడిని అయిపోయాను...."

సీత నా భుజంమీద ఆనుకుని ఏడుస్తోంది.

"ఏడవకు సీతా! ఇంక నిన్ను ఏడవనియ్యను." సీత కన్నీళ్ళు తుడిచాను.

"నాకు తెలుసు మీ బాధ. కానీ నేనేం చెయ్యను! నేను ఏ తప్పూ చెయ్యలేదని చెప్పటం ఎలా....ఏ తప్పూ లేకుండానే!"

"ఏది ఎక్కువైనా ఉక్కిరిబిక్కిరి అవుతాం సీతా! నాకు ప్రేమ కావాలి. నువ్వు నన్ను ప్రేమించటంలేదని భయం. ఎవరినో ప్రేమించి ఉంటావని అనుమానం."

"నాకు పెళ్ళికి ముందరే ప్రేమించటాలూ అవీ....ఇష్టం లేదు. నా ఫ్రెండ్ అరుణ ప్రేమించింది. రెండేళ్ళు అతడితో తిరిగింది. చివరికి తల్లిదండ్రులు కుదిర్చిన పెళ్ళి చేసుకుంది. అతడు విషం తాగాడు. ఎట్లాగో బ్రతికించారు. ఇప్పటిదాకా పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళి, ప్రేమ ఒకచోటే ఉండాలి!" అంది సీత.

"ఇప్పటిదాకా మనం మనసులు విప్పి మాట్లాడుకోలేకపోయాం. ఈ ప్రపంచంలో అన్నీ ఉన్నాయి సీతా! అమృతం-విషం, దేవతలు-రాక్షసులు, పూలూ-ముళ్ళూ. మనం ఏది వెతుక్కుంటే అది దొరుకుతుంది. ఎంత వింత సృష్టి! చివరికి నాకు అమృతం దొరికింది!"

సీత నా కళ్ళలోకి చూస్తూ నవ్వింది.

ఆ కళ్ళలో ఇప్పుడు బాధ లేదు. సంతోషం వెలిగించే దీపాల వెలుగు ఉంది. కోరికలు వర్షించే రత్నాల రాసులున్నాయి.